క్లుప్తంగా

అక్కినేనికి ఘన నివాళి



అక్కినేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్ నాయకులు

ఏలూరు (టూటౌన్) : సినీ నటుడు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ సిటిజన్స్ సంఘ సభ్యులు శ్రీహరికోటి తన గాత్రంతో అక్కినేని నటించిన అనేక సినిమాలలోని ఘంటసాల గానం చేసిన పాటలను పాడి శ్రోతలను ఆనందింపజేశారు. కార్యక్రమంలో ఏలూరు నగరంలోని ప్రసిద్ధ గాయకులు వై.అర్జునరావు, పి.సూర్య ప్రకాష్, ఎన్‌వీవీఎస్ ప్రసాద్, గౌరవఅధ్యక్షులు వీవీవీ హనుమంతరావు, ఉపాధ్యక్షులు వడ్లపట్ల నారాయణరావు, ఎం.శివరామ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

వారంలో రిపోర్టు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పెదవేగి మండలం కె.గార్డెన్స్ ఎంపీపీఈ స్కూల్‌లో ఎస్‌జీటీగా పని చేస్తున్న బి.సత్యప్రసాద్ 2019 ఆగస్టు 1 నుంచి విధులకు గైర్హాజరవుతూ నేటి వరకు ఆయన ఎక్కడ ఉన్నది వివరాలు తెలియడం లేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన గురించి విచారణ చేసిన పెదవేగి మండల విద్యాశాఖాధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం 2021 ఏప్రిల్ 15వ తేదిన చివరి సారిగా షోకాజ్ నోటీసు జారీ చేసినా అది ఆయనకు చేరలేదన్నారు. ఈ మేరకు ఏపీఈసీఎస్‌సీసీ (ఏ) నిబంధనలు అనుసరించి అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారని ఈ ప్రకటన విడుదలైన 7 రోజుల్లో ఆయన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రిపోర్టు చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులో రిపోర్టు చేయడంలో సత్యప్రసాద్ విఫలమైతే తదుపరి నోటీసులు లేకుండా వారిని సర్వీసు నుంచి తీసివేస్తామని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మండలంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మహేశ్వర కాలనీలో 21 శనివారం వినాయక నిమజ్జనం చేయనున్న కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక ఆముదాల అప్పలస్వామి కాలనీ, మహేశ్వరకాలనీ, వంగాయగూడెం, కైకలూరు బైపాస్ రోడ్డు, గాంధీ కాలనీ పరిసర ప్రాంతాలలో సాయంత్రం 4.00 గంటల నుంచి నిమజ్జనం ఊరేగింపు పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

వైఫల్యాల సెంచరీ

- తిరోగమనంలో హామీల అమలు
- టిడ్కో ఇళ్ల పంపిణీ ఊసే లేదు
- ఛిద్రమైన ప్రధాన రహదారులు





ఎన్నికలకు ముందు ఈనాడు దినపత్రికకు బడేటి చంటి ఇచ్చిన ఇంటర్వ్యూ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సూపర్ సిక్స్ పథకాల పేరిట ఎన్నికలకు ముందు ఊదరగొట్టి, ప్రభుత్వం వస్తే సంక్షేమమే సంక్షేమమని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ కొట్టడంలో విఫలమై డకౌట్ అయిన ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమే అని అందరి చూపుడు వేళ్లు అటు వైపే చూపిస్తున్నాయి. ప్రతిపక్ష నేతలపై దాడులు చేయడం, వారిపై తప్పుడు కేసులు పెట్టి వారి దారికి తెచ్చుకోవడం పైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్న సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు గమనిస్తూ ఉన్నారు. అటువంటి చర్యలకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి సైతం మినహాయింపు లేదని నియోజకవర్గంలో పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. తమ అధినేత ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక చతికిల పడడంతో ప్రజల దృష్టిని మరల్చడానికి గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించి ప్రజలను ఏమార్చడం పైనే ఎమ్మెల్యే దృష్టి పెట్టినట్టు కనిపిస్తోందని ప్రజలు అంటున్నారు. హామీలు నెరవేర్చడంలో డకౌట్ అయిన చంటి వైఫల్యాల్లో మాత్రం సెంచరీ కొట్టారని నియోజకవర్గ ప్రజలు సెటైర్లు వేస్తున్నారు.

తిరోగమనంలో ఎన్నికల హామీలు

ఎన్నికలకు ముందు ఈనాడు దిన పత్రికకు చంటి ఇచ్చిన ఇంటర్వ్యూలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని స్పష్టంగా చెప్పారు. కూటమి పార్టీల ఉమ్మడి మ్యానిఫెస్టోను చిలక పలుకుల్లా వల్లించిన చంటి ఇప్పుడు ముఖ్యమంత్రి సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించడంతో ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితిలో ఆత్మ రక్షణలో పడ్డారు. కూటమి ప్రభుత్వం అమలు చేయబోయే పథకాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి తన సొంత వాగ్దానాలను జోడించి ప్రజలను బలంగానే నమ్మించారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత తాను ఇచ్చిన వాగ్దానాలను తిరోగమనం పట్టించారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ ఊసే లేదు

తాను గెలిస్తే జాబ్ క్యాలెండర్ రూపొందిస్తానని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా ఇప్పటికీ జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదు. పోనీ పరిశ్రమలు ఏవైనా తీసుకొచ్చారా అంటే దానికి సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు.



టిడ్కో ఇళ్ల పంపిణీ ఊసే లేదు

నగరంలో పేద ప్రజల కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లు నిర్మించిందని, వాటి నిర్మాణం పూర్తయినా వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వలేదని చంటి ఇంటర్వ్యూలో ఊదరగొట్టారు. తాను ఎమ్మెల్యే అయిన వెంటనే నగరంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. మరి ఆయన ఎమ్మెల్యే అయి వంద రోజులు దాటినా ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 60 ఎకరాల్లో ప్రారంభించిన టిడ్కో ఇళ్లు గతంలో 40 భవనాలు పూర్తి స్థాయిలో నిర్మాణం జరుగగా, ఒక్కో భవనంలో 48 ప్లాట్లు ఉన్నాయి. ఈ 40 భవనాల్లో 20 నివాసయోగ్యంగా ఉన్నప్పటికీ వాటిని లబ్ధిదారులకు ఇవ్వడానికి ఎమ్మెల్యేకు మనస్సు రాలేదా అంటున్నారు.



గోతులమయమైన రహదారి

ఛిద్రమైన ప్రధాన రహదారులు..

తాను అధికారంలోకి వచ్చిన వెంటనే నగరాన్ని అభివృద్ధి చేస్తానని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తానని చంటి చెప్పారు. అలాగే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేస్తామని, రహదారులను బాగు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇవన్నీ ఒట్టి నీటి మూటలేనని అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా వీటిపై దృష్టి పెట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. నగరంలోని ప్రధాన రహదారులన్నీ ఛిద్రమై పోయాయని, ఇప్పటి వరకూ వాటిని బాగు చేయించకపోవడం వైఫల్యం కాదా అని ప్రశ్నిస్తున్నారు. రహదారులు అడుగుపెట్టడానికి వీలు లేకుండా ఉండడం ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శాంతి భద్రతలు క్షీణించాయి



ఏలూరు నియోజకవర్గంలో శాంతి భద్రతలు క్షీణించాయి. ఇటీవల గంజాయి మత్తులో స్థానిక రామకోటి వద్ద ఒక వ్యక్తి మహిళపై అత్యాచారానికి పాల్పడినా చర్యలు తీసుకోలేదు. దయానంద సరస్వతి ఆశ్రమం ఆధ్వర్యంలోని వసతి గృహంలో బాలికలపై కామాంధుడు చేసిన అఘాయిత్యం నియోజకవర్గంలో శాంతి భద్రల వైఫల్యానికి అద్దం పడుతున్నాయి.

– రాజనాల రామ్మోహనరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

ధరల నియంత్రణలో విఫలం



పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యారు. కూరగాయల ధరలు, నిత్యవసర వస్తువుల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. వంట నూనెల ధరలు సలసల మరుగుతున్నాయి. ఈ ప్రభుత్వం ముస్లింలను దారుణంగా మోసం చేసింది. 50 సంవత్సరాలు నిండిన వారికి ఇస్తామన్న పింఛన్ కోసం ముస్లింలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నీ వెంటనే ప్రారంభించేలా ఎమ్మెల్యే చంటి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

– ఇస్మాయిల్ షరీఫ్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలారాణి

ఏలూరు (టూటౌన్): స్వామి దయానంద సరస్వతి వసతి గృహంలో విద్యార్థులపై లైంగిక వేధింపులకు దిగిన శశికుమార్‌ను వెంటనే పోక్సో చట్టం ప్రకారం అరెస్టు చేయాలని, నిందితుడికి సహకరించిన వార్డెన్ ఫణిశ్రీ, కేర్ టేకర్ లావణ్యలను శిక్షించాలని ప్రజా సంఘాల జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవన్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శిడె.శ్యామలరాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్‌లు మాట్లాడుతూ వసతి గృహానికి ప్రభుత్వ గుర్తింపు లేకున్నా సిఫార్సులు చేయడం ద్వారా అధికారులకు, ఆశ్రమానికి మధ్య లాలూచీ తెలుస్తుందన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి.శారద,అరుణ కుమారి విద్యార్థి సంఘాల నాయకులు కె.నాని, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

వసతి గృహంలో విద్యార్థినులపై లైంగిక దాడులకు పాల్పడిన శశికుమార్‌ను అతనికి సహకరించిన వార్డెన్ ఫణిశ్రీ, కేర్ టేకర్ లావణ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 21న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఐద్వా, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీలు తెలియజేశాయి. కార్యక్రమంలో అన్ని ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చేసిందేమీ లేక.. ఏం చేశారో చెప్పలేక..!

ఏలూరులో మొక్కుబడిగా వంద రోజుల పాలన కార్యక్రమం



తిలక్ నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చేసిందేమీ లేదు.. ఏం చేశారో ఇంకెలా చెబుతారు.. అందుకే వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందంటూ కూటమి నేతలు జబ్బలు చరుచుకునే ప్రయత్నం చేశారు. అది చూసిన జనం.. సూపర్ 6 పేరుతో ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు చేయలేదు.. ఇంకేం చెబుతారంటూ పెదవి విరవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా తమది మంచి ప్రభుత్వం.. అంటూ ఏలూరులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమం తీరిది. స్థానిక 47వ డివిజన్ తిలక్ నగర్‌లో సాయంత్రం నాలుగు గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి కార్యాలయం తొలుత ప్రకటించింది. 4.30 వరకు ఎమ్మెల్యే రాకపోగా.. ఈలోగా వర్షం ప్రారంభమైంది. దీంతో ఎమ్మెల్యే చంటి తీరుబడిగా 5.15 గంటలకు అక్కడికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలోని ఒక వీధిలో మొక్కుబడిగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సభా వేదికపైకెక్కి మాట్లాడుతూ గత ప్రభుత్వాన్ని విమర్శించడం పైనే దృష్టిపెట్టారు. దీంతో డివిజన్ అభివృద్ధి కోసం ఏమైనా ప్రకటన చేస్తారని ఆశగా ఎదురుచూసిన ప్రజలు ఉసూరుమన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ వందనాల దుర్గాభవానీని డిప్యూటీ మేయర్‌గా నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కూటమిలోని బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కనిపించకపోవడం గమనార్హం. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో స్థానికులు ప్రశ్నిస్తారనే కారణంతో వారు ముఖం చాటేసినట్లు స్థానికులు గుసగుసలాడుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, నేతలు సీహెచ్ వెంకటరత్నం, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	21

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	68	చిక్కుడు కాయలు	68-152
వంకాయలు (కాంతులు)	68	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	52	ములక్కాడలు	07-10
బెండకాయలు	36	కంద	60
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	38
కాకర కాయలు	34-50	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	48	అల్లం	80-160
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	45
క్యారెట్	40-54	పాలకూర	15
దొండకాయలు	48	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	54	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణీ	--
ఆనపకాయ (1)	30-40	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	60

సర్పంచుల హక్కులను కాపాడాలి

దెందులూరు: శ్రీరామవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ అజెండా తయారుచేసిన లేఖను తీసుకోవడం లేదని దీనికి సంబంధించిన రశీదు సైతం ఇవ్వనని చెబుతున్నారని ఇదెక్కడి న్యాయమని, సర్పంచుల హక్కులను కాపాడాలని ఉన్నతాధికారులను కోరానని శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని అన్నారు. శ్రీరామవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ బోర్డు సమావేశం నిర్వహించడానికి తేదీ, అజెండా ఖరారు చేయమని వాట్సాప్, రిజిష్టర్ పోస్టు ద్వారా పంపారన్నారు. దానిపై తాను శుక్రవారం అజెండా లెటరును పంచాయతీ కార్యదర్శి దాసుకి పంపించినట్టు తెలిపారు. గ్రామ కార్యదర్శి రశీదు ఇవ్వలేదని, నేను తయారు చేసిన అజెండా లెటరును పరిశీలించి, సర్పంచుల హక్కులను కాపాడాలని ఎంపీడీఓ వీ.శ్రీలతను కోరారు.

ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ అడగగా తాను అజెండా లెటర్ తీసుకోమని గ్రామ కార్యదర్శికి చెప్పానన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసు మాట్లాడుతూ సర్పంచ్ కామిరెడ్డి నాని ఒక వ్యక్తితో అజెండా లెటర్ పంపించిన సంగతి వాస్తవమేనని, ఆ లెటర్‌ను నేను తీసుకులేదన్నారు. రశీదు ఇవ్వనని చెప్పడం వాస్తవమేనని, వేరే వ్యక్తికి రశీదు ఎలా ఇస్తానని ఆయన అన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

దెందులూరు: ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టి కృషితో విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పించి వారిని వృద్ధిలోకి తీసుకురావాలని దెందులూరు ఎంఈఓ-1 ఎవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని సీతంపేట, కొమిరేపల్లి, సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యుత్, స్టోర్ రూమ్ సౌకర్యాలను ఆయన పరిశీలించారు.

హైకోర్టు ఏజీపీగా గంజి నిలోత్పల్

దెందులూరు: రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా దెందులూరు గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్ గంజి వెంకట్రావు, సువర్చల దంపతుల కుమారుడు నిలోత్పల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు శుక్రవారం లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసింది. నిలోత్పల్ హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ లా కళాశాలలో న్యాయ విద్య కోర్సును పూర్తి చేశారు. ఆయన నియామకం పట్ల విద్యా, న్యాయ, ఆధ్యాత్మిక, వైద్య, సేవా, కళా రంగాల్లో ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన తప్పనిసరి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఏలూరు రూరల్: పౌష్టికాహారంపై బాలికలకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎ.పద్మావతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరు రూరల్ మండలం గుడివాక లంక జడ్పీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల మానసిక, శారీరక ఎదుగుదలకు విటమిన్స్, మినరల్స్, కాల్షియం, ఐరన్ అవసరమన్నారు. ఆకుకూరల నుంచి విటమిన్స్, కూరగాయాల్లో మినరల్స్, చిరు ధాన్యాల ద్వారా మాంసకృతులు, పండ్లు తినడం వల్ల శరీరానికి అవసరమైన కాల్షియం విటమిన్స్ పుష్కలంగా అందుతాయన్నారు. బాలికల ఆరోగ్యం సమాజానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మోతేవారితోటలోని 11వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్ డి.వరలక్ష్మి మాట్లాడుతూ పోషకాహారం గల టేక్ హోమ్ రేషన్ రూపంలో ఇచ్చే రాగి పిండి, అటుకులు, ఖర్జూరం, బెల్లం, చక్కీలు గర్భిణులు ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో డి.సావిత్రి, చిత్తజల్లు అనూషా, జి.మహేశ్వరి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

44వ డివిజన్ శాస్త్రి సెంటర్ కేంద్రంలో

స్థానిక 44వ డివిజన్ శాస్త్రి సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. పోషకాహార విలువల గురించి అంగన్‌వాడీ కార్యకర్త డి.సావిత్రి వివరించారు.

కిషోర బాలికలకు హెచ్‌బీ పరీక్షలు

స్థానిక శనివారపుపేటలో కిషోర బాలికలకు హెచ్‌బీ పరీక్షలను నిర్వహించారు. ఐసీడీఎస్ ఏలూరు ప్రాజెక్టు సూపర్‌వైజర్ బి.మంగ మాట్లాడుతూ ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ డాక్టర్ శాలిని మాట్లాడుతూ బలమైన ఆహారం తీసుకుంటే రక్త హీనత రాదన్నారు.

జీవో 84 వెంటనే రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా మున్సిపల్ ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు సర్దుబాటు చేయడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కారణమైన జీవో 84ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ ఏలూరు నగరశాఖ ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీటీఎఫ్ ఏలూరు నగరశాఖ సమావేశం స్థానిక సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో కురమ ఆనంద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ తొమ్మండ్రు ప్రకాష్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, సాధారణ బదిలీలు చేపట్టాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు మాట్లాడుతూ సర్దుబాటులను మండల స్థాయిలో చేయవలసి ఉండగా ప్రభుత్వం ఏకపక్షంగా ఉపాధ్యాయులను డివిజన్ స్థాయిలో సర్దుబాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సర్దుబాటులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కౌన్సిలర్లు జె.శాంతి కుమార్, పి.రోజా, కె.పాట్టియ్య, సీహెచ్ వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.